మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

వైభవంగా 'మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం'

- కనులపండువగా సాగిన ఆదిశంకరుల శోభాయాత్ర
- భగవన్నామస్మరణతో మార్మోగిన సద్గురు సదనం

చేర్యాల, జనవరి 28: చేర్యాల పట్టణంలోని శృంగేరినగర్ సద్గురు సదనంలో ఆదిశంకరమూర్తి ప్రతిష్ఠాంగ తృతీయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం 'మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకాన్ని' అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉదయం 8గంటల నుంచి అర్చకులు వివిధ అర్చనలు, అభిషేకాలు చేసి రుద్రహోమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. సద్గురు సదనం ఆలయ పరిసరాలన్నీ భగవన్నామస్మరణతో మార్మోగాయి. తీర్థప్రసాద వితరణ అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాలకు చేర్యాల ప్రాంత నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. శనివారం రాత్రి పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయం నుంచి సద్గురు సదనం వరకు ఆదిశంకరుల శోభాయాత్ర కనుల పండువగా జరిగింది. కార్యక్రమంలో సద్గురు సదనం నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.


వార్షికోత్సవానికి హాజరైన భక్తజనం

కేసీఆర్‌తోనే గ్రామాల అభివృద్ధి

గజ్వేల్‌లో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, సన్మానం పొందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి
- సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు సన్మానం

గజ్వేల్, జనవరి 28: కేసీఆర్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమైందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సర్పంచుల పదవీ కాలం ముగుస్తున్న సందర్భంగా ఆదివారం గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు పట్టణంలోని శోభ గార్డెన్‌లో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మాజీ సీఎం కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధి చిరస్థాయిలో నిలిచిపోతుందన్నారు. కేసీఆర్, తన్నీరు హరీశ్‌రావు కృషితో గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకునే అవకాశం దక్కడం అదృష్టమన్నారు. గ్రామాల్లో ప్రజల మధ్య గొడవలు పెట్టేందుకే ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయబోతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అర్హులందరికీ అవకాశం కల్పించాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసిన వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మాజీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జడ్పీటీసీ మల్లేశం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ లతీఫ్

తొగుట సీఐగా లతీఫ్

తొగుట, జనవరి 28: తొగుట సీఐగా ఆదివారం లతీఫ్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన కమలాకర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో లతీఫ్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషిచేస్తానని తెలిపారు.

చేర్యాల సీఐ బదిలీ

చేర్యాల, జనవరి 28 : చేర్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణరెడ్డి బదిలీ అయ్యారు. ఇటీవల పోలీస్‌శాఖ చేపట్టిన బదిలీల్లో భాగంగా ఉన్నతాధికారులు ఆదివారం ఆయన్ను బదిలీ చేశారు. ఆయన స్థానంలో మల్టీజోన్-1లో అటాచ్‌డ్‌గా ఉన్న సీఐ ఎల్.శ్రీనును చేర్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. చేర్యాల సీఐగా విధులు నిర్వహించిన సత్యనారాయణరెడ్డి ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

సీసీ కెమెరాల వితరణ

అక్కన్నపేట, జనవరి 28: మండలంలోని రామవరం ప్రభుత్వ పాఠశాలకు ఆదివారం రూ. 50వేల విలువ చేసే సీసీ కెమెరాలను కర్ణకంటి అశోక్‌చారి బహూకరించినట్లు పాఠశాల ఉపాధ్యాయుడు నోముల చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో రాత్రి సమయంలో పోకిరీలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, వాటిని అరికట్టేందుకు పాఠశాల ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. దాత అశోక్‌చారిని పలువురు అభినందించారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

సిద్దిపేట టౌన్,జనవరి 28 : దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని హెచ్ఎంఎస్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌ప్రసాద్, బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదారి మల్లేశం పిలుపునిచ్చారు.బీడీ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను కేంద్రం రద్దు చేస్తూ యాజమాన్యాలకు ఉపయోగపడేలా చట్టాలను రూపొందించిందని మండిపడ్డారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమ్మెకు దిగుతున్నామన్నారు.ప్రతి కార్మికుడి గరిష్ఠ పింఛన్ రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఈదారి లక్ష్మణ్, మధు, నర్సింహులు, లలిత,రాజేశ్వరి, అనిత, రామచంద్రం పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు యోగా దోహదం

సిద్దిపేట టౌన్, జనవరి 28 : ఆరోగ్య పరిరక్షణకు యోగా కీలకమని భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగా జిల్లా అధ్యక్షుడు రంగాచారి అన్నారు.భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ పతంజలి యోగా ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్నవారికి ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో యువ భారత్ జిల్లా అధ్యక్షుడు మనోహర్, శ్రీహరి, మల్లేశం, శ్రీను, కనకరాజు, రవి పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక సమావేశం

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 28: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ బద్ది పడిగె కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25లో మండల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. సమావేశానికి వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

చీరలు, నిత్యావసరాలు పంపిణీ

హుస్నాబాద్‌టౌన్, జనవరి 28: బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో ఆదివారం వితంతువు, దివ్యాంగుల సమావేశం నిర్వహించారు. వితంతువులకు చీరలు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్‌చైర్‌పర్సన్ రజితావెంకన్న మాట్లాడుతూ సమాజంలో వివక్షకు గురికాకుండా వితంతువులు, దివ్యాంగుల కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్న బాలవికాస సంస్థను అభినందించారు. కార్యక్రమంలో బాలవికాస వాటర్‌ప్లాంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్ పద్మ, ఫెడరేషన్ సభ్యుడు బంక చందు, రాజు, శ్రీధర్ పాల్గొన్నారు.


హుస్నాబాద్‌లో వితంతువుకు చీర అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజితావెంకన్న

కనకయ్యగౌడ్‌కు నియామకపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉత్సవ కమిటీ చైర్మన్‌గా కనకయ్యగౌడ్

సిద్దిపేట, జనవరి 28: పుల్లూర్ బండల క్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్‌గా పుల్లూర్ కనకయ్యగౌడ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. డైరెక్టర్లుగా ఒగ్గు యాదగిరి, ఐరేని దేవిరెడ్డి, బెస్త రాములు, గొడుగు రవి, పెద్ద కర్రెకిష్టయ్య, వడాల కనకయ్యను నియమించారు. చైర్మన్ కనకయ్యగౌడ్ మాట్లాడుతూ పుల్లూర్ జాతర సందర్భంగా భక్తులకు సౌకర్యాలు కల్పిస్తానన్నారు.

ఉపాధ్యాయుడికి ప్రతిభా పురస్కారం

పురస్కారం అందుకున్న మూర్తిని అభినందిస్తున్న సర్పంచ్, హెచ్ఎం తదితరులు

చేర్యాల, జనవరి 28: మండలంలోని వేచరేణి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మంగళగిరి రామచంద్రమూర్తి పురస్కారం, నగదు పారితోషికం అందుకున్నారు. విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీస్తూ సృజనాత్మక రచనలు చేయిస్తున్న ఆయన ఇటీవల వేచరేణి పాఠశాల విద్యార్థులతో 'వేచరేణి వెలుగులు' అనే కవితా సంపుటిని వెలువరించగా రాజన్నసిరిసిల్ల జిల్లాకేంద్రంగా పనిచేస్తున్న చింతోజు బ్రహ్మయ్య మెమోరియల్ సంస్థ బాల ప్రతిభా పురస్కారం, నగదు పారితోషికాన్ని ప్రకటించింది. రామచంద్రమూర్తిని హెచ్ఎం నరేందర్, సర్పంచ్ దుర్గయ్య, ఎస్ఎంసీ చైర్మన్ యాదగిరి, ఉపాధ్యాయ, చేరసం బృందాలు అభినందించాయి.

ఉపాధిహామీ పథకాన్ని అమలు చేయాలి

మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

మిరుదొడ్డి, జనవరి 28: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పెద్ద లింగన్న గారి శంకర్ కోరారు. ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ ఆదివారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్కకు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ఉపాధి హామీ చట్టాన్ని ఉల్లంఘిస్తూ కూలీల పని హక్కులను విస్మరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట డీబీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం

హుస్నాబాద్‌రూరల్/ అక్కన్నపేట: హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లోని పలు గ్రామాల్లో సోమవారం రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. హుస్నాబాద్ మండలంలోని పందిల్లలో పల్లె దవాఖాన, రాములపల్లి, వంగరామయ్యపల్లి గ్రామాల్లో జీపీ భవనాలు, వాటర్ ట్యాంకులు, అక్కన్నపేట మండలంలోని గండిపల్లిలో పల్లె దవాఖాన, అక్కన్నపేట, రేగొండ, జనగామ గ్రామాల్లో వాటర్ ట్యాంకులు, అంతకపేటలో ఐకేపీ భవనం, ఓపెన్ జిమ్, అంతకపేట-గుబ్బడి పీఆర్ రోడ్డు పనులను ప్రారంభించనున్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపనకు భూమి పూజ

కమలాయపల్లిలో విగ్రహాల ప్రతిష్ఠాపనకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ అంజయ్య

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 28: ఉమ్మడి మద్దూరు మండలంలోని కమలాయపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాల ప్రతిష్ఠాపనకు ఆదివారం సర్పంచ్ ఓరుగంటి అంజయ్య భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా బడుగు, బలహీన వర్గాల కోసం పూలే దంపతులు చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. మహనీయుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుత్తి శ్రీనివాస్, వార్డు సభ్యులు పంజ సూర్య, వెంకటమ్మ, శ్రీనివాస్, కొమురవెల్లి ఆలయ మాజీ డైరెక్టర్ వజ్రోజు శంకరాచారి, ఎన్విరాన్‌మెంటల్ జాతీయ అధ్యక్షుడు లింగంపల్లి చంద్రశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు గంధమాల యాదయ్య, మాజీ సర్పంచ్‌లు కొల్పుల భాగ్య, కొల్పుల నర్సింహులు, రేషన్ డీలర్ కాళీ కనకయ్య, నాయకులు ఓరుగంటి శంకర్, శనిగరం ఎల్లం, సింగపాక బాలయ్య గంధమాల కనకయ్య పాల్గొన్నారు

రైలు ఢీకొని వ్యక్తి మృతి

గజ్వేల్, జనవరి 28: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బంగ్లావెంకటాపూర్ శివారులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్ బారిక్(24) గ్రామ సమీపంలోని కాల్వ నిర్మాణ పనుల్లో పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం రైలు పట్టాల పక్కనే ఉన్న చెరువులో స్నానం చేసేందుకు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి చెవులు వినిపించవని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని శవపంచనామా నిర్వహించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం గజ్వేల్ దవాఖానకు తరలించారు.

విద్యుత్‌షాక్‌తో బాలుడు మృతి

హుస్నాబాద్‌రూరల్, జనవరి 28: విద్యుత్‌షాక్‌తో బాలుడు మృతిచెందాడు. ఈ సంఘటన హుస్నాబాద్ పట్టణంలోని డిపో వెనుక కాలనీలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన ఎండీ శంషీద్ కుమారుడు సాధిక్(6) ఆదివారం మధ్యాహ్నం ఇంటిపైన ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు కరెంట్‌తీగలు తగిలాయి. దీంతో బాలుడి శరీరం కాలిపోగా, వెంటనే అధికారులకు సమాచారమిచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అప్పటికే సాధిక్ మృతిచెందాడు. మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు విలపించారు.

రెండో రోజూ కొనసాగిన క్రీడలు

సిద్దిపేట,జనవరి 28: డీసీసీబీ ఆధ్వర్యంలో సిద్దిపేట ఆచార్య జయశంకర్ స్టేడియంలో జరుగుతున్న క్రీడలు రెండో రోజూ ఆదివారం కొనసాగాయి. బ్యాడ్మింటన్ ఫైనల్‌లో నల్లగొండ మెదక్ జట్లు తలపడగా నల్లగొండ జట్టు గెలుపొందింది. క్రికెట్, క్యారం పోటీల్లో కరీంనగర్ జట్టు విజేతగా నిలిచింది.

బ్యాడ్మింటన్ ఫైనల్‌లో పాల్గొన్న నల్లగొండ-మెదక్ జట్లు

ప్రభుత్వం మంజూరు చేసిన పాడిగేదెలతో లబ్ధిదారులు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 28: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ధూళిమిట్ట మండలంలోని జాలపల్లి సర్పంచ్ వరలక్ష్మీసాగర్ అన్నారు. ఆదివారం గ్రామానికి చెందిన 11 మంది లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ నుంచి రూ. లక్షా40వేల సబ్సిడీతో అందజేసిన పాడిగేదెలను ఆమె పంపిణీ చేశారు. దళితుల అభ్యున్నతే లక్ష్యంగా మాజీ సీఎం కేసీఆర్ కృషి చేశారని సర్పంచ్ గుర్తుచేశారు. ఈ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు పాడిగేదెలు అందించిన ఘనత కేసీఆర్ సర్కారుకే దక్కిందన్నారు.

కవిత్వానికి జీవితమే పునాది

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కవి శివారెడ్డి

జలతంత్రి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవి శివారెడ్డి, మంజీరా రచయితల సంఘం సభ్యులు

సిద్దిపేట టౌన్, జనవరి 28: కవిత్వానికి జీవితమే పునాది అని ప్రఖ్యాత కవి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత శివారెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు రంగాచారి అధ్యక్షతన కవి తైదల అంజయ్య వచన కవితా సంపుటి జలతంత్రి ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. శివారెడ్డి మాట్లాడుతూ.. మరసం అందించిన సామాజిక చైతన్యంతో కవిత్వం రాయడం మొదలు పెట్టిన కవి తైదల అంజయ్య అని అన్నారు. మంజీరా రచయితల సంఘం ఇచ్చిన చైత్యనంతో తైదల అంజయ్య, సమాజానికి కొత్త చూపుతో అర్థం చేసుకొని కవిత్వం రాశాడని డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. కవి గాయకుడు, శాసన మండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తైదల అంజయ్య మౌనంగా, బిడియంగా కనిపించినా తన కవిత్వంలో మండుపాతరలు పేలినంత శక్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు రంగాచారి, కోటేశ్వర్‌రావు, దేవీప్రసాద్, పాపయ్య, అంజయ్య, విజయ్, అశోక్, శివకుమార్ పాల్గొన్నారు.

కారు బోల్తా..విద్యార్థి మృతి

- మృతుడు సిద్దిపేట పట్టణవాసి

మృతుడు నాయిని కల్యాణ్‌రెడ్డి(ఫైల్)

దుండిగల్, జనవరి 28: కారు అదుపు తప్పి బోల్తాపడడంతో ఓ విద్యార్థి మృతిచెందాడు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన జానకీరామ్ అలియాస్ మణి, ధనుష్, సిద్దిపేట పట్టణానికి చెందిన నాయిని కల్యాణ్‌రెడ్డి (21) స్నేహితులు. జానకీరామ్, కల్యాణ్‌రెడ్డి మేడ్చల్‌లోని సీఎంఆర్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి కొంపల్లిలో ఓ వసతి గృహంలో ఉంటున్నారు. ధనుష్ దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ కొంపల్లిలోని మరో హాస్టల్‌లో ఉంటున్నాడు. జానకీరామ్, ధనుష్ టెన్త్ క్లాస్‌మెట్స్. ఖమ్మంకు చెందిన శివసాయి, చందు అనే ఇద్దరు స్నేహితులు శనివారం కొంపల్లిలోని తమ స్నేహితుల వద్దకు వచ్చారు. జానకీరామ్‌కు చెందిన ప్లాట్ బాచుపల్లిలో ఉంది. అతడు మిత్రులతో (ఐదుగురు) కలిసి తన కారులో శనివారం కొంపల్లి నుంచి బాచుపల్లికి చేరుకున్నారు. రాత్రి 12 గంటల వరకు పార్టీ చేసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి అదే కారులో తిరుగు ప్రయాణమయ్యారు. కారు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ బౌరంపేట్ నుంచి బహదూర్‌పల్లి వెళ్లే మార్గంలో మూలమలుపు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారు వెనుక సీట్లో కూర్చున్న సిద్దిపేటకు చెందిన కల్యాణ్‌రెడ్డి తలకు బలమైన గాయలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం హైదరాబాద్‌లోని గాంధీ వైద్యశాలకు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కారు నడిపిన జానకీరామ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. స్వల్పంగా గాయపడిన ధనుష్, శివసాయి, చందు దవాఖానలో చికిత్స పొందుతున్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెలు

బెజ్జంకి, జనవరి 28: కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందాయి. ఈసంఘటన మండలంలోని ముత్తన్నపేట శివారులో జరిగింది. కోహెడ మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన కర్ర శశిధర్ ముత్తన్నపేట శివారులో గొర్రెల షెడ్డు ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం తెల్లవారు జాముల గొర్రెల షెడ్డుపై కుక్కలు దాడి చేయగా 28 గొర్రెలు చనిపోయినట్లు బాధిత రైతు తెలిపాడు. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319424-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657